## 24. త్రిశంకు

"మీ ఇంట్లో రేడియోలేదుటే?" అంది సావిత్రి.

అందులో తను విందామనుకున్న ప్రోగ్రాం విన్లేకపోతున్నానే అన్న నిస్పృహ వున్నా, కొంత యెద్దేవా వున్నట్టు ధ్వనించింది, భానుమతికీ జగన్నాథానికీ కూడానూ.

అయితే జగన్నాథం, భానుమతి మొహాలు చూసుకున్నది మాట అర్థానికేగాని లోపల ధ్వనికి కానేకాదు.

రేడియోలేదు.

సైకిల్లేదు.

ఫొన్లేదు.

పదేళ్ల ఉద్యోగానికీ, ఆరేళ్ళ కాపరానికీ వాళ్ళిద్దరూ వాళ్ళకి ముగ్గురూ, అంతే.

నాలుగేళ్ళ నించీ అనుకుంటూనే వున్నారిద్దరూనూ, అనుకున్నంత మాత్రాన్ని అవన్నీ వొచ్చిపడతాయా?

సంపాదిస్తేనే వొస్తాయవి.

❖ ❖ ❖

మధ్యాన్నం పూట అన్నిసార్లు కాఫీలు మానెయ్యండి - అంటే వినిపించుకోరీయన అనుకుంటూ వంటింట్లో ఒత్తుల స్టవ్ దగ్గర చతికిల పడింది భానుమతి.

పొద్దున్న తొమ్మిదిన్నరకి భోంచేసి వెళతారాఫీసుకి. ఫ్లాస్కులో పోసి కాఫీయిస్తే పట్టుకెళ్లడానికి నామోషీట. పయిగా చుట్టూరా వున్న జనం - నువ్వెవరితోనూ కలవ్వు - అంటూ హేళనచేస్తారుట.

నెలకి రెండు మూడుసార్లు సినిమాలకెళ్ళడం మానేయండీ - అంటే చెవిని పెట్టరాయన. 'అమ్మమ్మా, గొప్ప పిక్చరు!' అంటూ బయల్దేరుతారు. తిరిగొచ్చియేడిసినట్టుంది వెధవసినీమా అంటూ రెండు ఆస్ప్రో బిళ్ళలు మింగి అర్థరాత్రప్పుడు కాఫీయిమ్మని ప్రాణం తీస్తారు. సంవత్సరానికి డెబ్భయి సినీమాలు వొస్తాయి. ఒక్కొక్క భాషలోనూ - అవన్నీ మనం చూడక్కర్లేదని ఎన్నాళ్ళకి తెలుసుకుంటారో మరి!

పైగా కాఫీ కెళ్ళినా, సినిమా కెళ్ళినా జట్టుగాళ్ళుండాలి; కాఫీ తాగుతున్నంతసేపూ కబుర్లు చెప్పుకోడానికీ, సినిమా చూస్తున్నంతసేపూ ఒకడిక్కనబడంది మరొహాడు చూపించుకోడానికీ కాబోలు!

'ఎటికెట్' పేర్ని టిక్కెట్లు వొక్కరే కొనడం బిల్లు ఒక్కరే చెల్లించడం న్నూ.

దానికేముంది. ఇవాళ మనం ఖర్చు పెడితే రేపు వాళ్ళు పెడతారు. ఇందులో పోయిందేముంది; అంటారు.

గడుసువాడికి పలచనంబలీ; ఓర్చినగేదెకి తేటనీళ్ళూ అన్నారు. అలాగే జరుగు తోంది అక్షరాలాసూ.

ఈ చెవితో విని ఆ చెవిలోంచి వొదిలేసే మనిషికి యెంత చెబితేమాత్రం యేం లాభం?

ఈ జన్మకింతే. ఈ ముగ్గురు బిడ్డలూ అడవికి పుట్టి ఆకున పెరగాలని రాసున్న తరువాత, తక్కువనోములు నోచి యెక్కువ ఫలితాలు రమ్మంటే యెలా వస్తాయి.

❖ ❖ ❖

ఎంతసేపూ నువ్వు కాఫీలు మానెయ్యి నువ్వు సినీమాలు మానెయ్యి - ఆఫీసులో అర్ధరాత్రైనా ఇంటికి నడిచే తగలడు గానీ రిక్షా యెక్కకు - అనడమేగాని నా కష్టసుఖాలు విచారించదు భాను; అనుకుంటూ ట్రాన్సిస్టర్ యెరువు తేడానికి రాజారావు దగ్గరికి బయలుదేరాడు జగన్నాథం. ఆవిడెవరో అన్నట్టు పనిచేసే మొగవాడికి గుండెల్లోకి తోవ కడుపులోంచుంటుంది. తొమ్మిదిన్నరకి నాలుగు మెతుకులు కొరికి సాయంకాలం దాకానూ వొక్కొక్కప్పుడు రాత్రిదాకానూ ఏమీ తినకుండా యేమీ తాక్కుండా యెలాగు, పనిచెయ్యడం?

నలుగుర్లో వున్నప్పుడు నలుగుర్లాగే వుండాలి గాని నన్ను ముట్టుకోకు నా మాల కాకీ అన్న పద్ధతిలో మనిషికి వీలవుతుందా? అవదంటే మరి భాను తగువు పెట్టుక్కూచుని నిద్దర చెడగొట్టడమే కాక "మూడు" పాడుచేస్తుంది.

ఎక్కడ పడితే అక్కడ దొర్లుతాయి గాజులూ, పూసలూ, రంగు రంగుల తిలకం సీసాలూ, యిమిటేషను సరుకులూను. ఆడపిల్ల సరదా సరే, ఎంత సరదా అయితే మాత్రం కొందామంటే కొరివీ అమ్ముదామంటే అడివీ లాంటి సరుకులెందుకు కొంటావే అంటే మరి పట్టించుకోదు.

రేడియో లేదంటే లేదు మరి.

ఎలా వొస్తుంది! ఇద్దరూ పొదుపు చేస్తేనే వొస్తుంది. అంతేకాని నా ఒక్కడి ఖర్చు మీద దండయాత్ర న్యాయమా?

❖ ❖ ❖

"ఇక్కడంతా కులాసాగానే వున్నారు. నేను ఈ నెల ఇరవయ్యారో తేదీన బయల్దేరి విశాఖపట్నం వద్దామనుకుంటున్నాను. ఇంకో నెల్లాళ్లు ఉండు; పిల్లలకి శలవులే కదా అని మా అన్నయ్య అంటున్నాడు. కాని నాకు ఇక్కడుండాలని లేదు. మీరు పదిహేను రోజు లకిందట రాసిన ఉత్తరంలో ఇంటివాళ్ళు ఇల్లు బలవంతంగా ఖాళీ చెయ్యమన్నారు కనక సామానంతా వరండా గదిలో సర్దేసి ఆఫీసులోనే మకాం పెట్టేననీ త్వరలో ఇంకో యిల్లు చూస్తున్నాననీ రాసేరు. ఇల్లు చూసేరో లేదో వెంటనే జవాబురాస్తే టిక్కెట్లు రిజర్వేషను

చేయించుకుంటాను" అని తను రాసిన ఉత్తరానికి వారం రోజులదాకా సమాధానం రాకపోడం; ఆ తరువాత ఒచ్చిన ఉత్తరంలో కూడా ఇల్లు యింకా మన చేతికి రాలేదు గనక నువ్వు అక్కడే యింకో ఇరవై రోజులుండు" అని జగన్నాథం రాయడం; భానుమతికి చాలా ఆశ్చర్యం - కొంచెం చికాకు కలిగించాయి. ఎలాగయితేనేం, అన్నయ్య చెప్పినట్టుగానే నెల్లాళ్ళకి టిక్కెట్లు రిజర్వు చేయించుకుని, అతనికోసం అదనంగా ఒక టిక్కెట్టు కూడా రాయించి రసీదులు తీసుకుని బయల్దేరొచ్చింది భానుమతి.

స్టేషన్లో మొగుడితో బాటు రిక్షాయెక్కి "ఇల్లెక్కడ తీసుకున్నారండీ?" అని అడిగింది.

"చెబుతాగా......" అంటూ "ఆ బుట్టలోగుడ్డలు కిందపడేటట్టున్నాయి. సరిగ్గా సద్దు" అని మాట మార్చాడు జగన్నాథం.

ఆ కబురూ యీ కబురూ చెప్పుకుంటూ వుంటే రిక్షా యెటుపోతోందో గమనికకి రాలేదు భానుమతికి. కాని రిక్షా సరాసరి పాతయింటి దగ్గరే ఆగేసరికి "ఇదేమిటి? ఇల్లు మారుస్తున్నానని రాసేరు; మరిచిపోయి పాతింటికే తీసుకొచ్చేసేరా...?" అనడిగింది.

"ఇల్లు మార్చేసేను. పాతిల్లులా కనిపించినా ఇది మన పాత యిల్లు కాదు" అని చిరునవ్వు నవ్వుతూ రెండు చేతులకీ అందినంత సామాను తీసుకుని ముందు పరిగెట్టాడు జగన్నాథం.

రెండో రిక్షాలో వొచ్చిన పిల్లల్ని దింపుకుని మిగతాసామాను లెక్కెట్టుకుని ఇంట్లో అడుగు పెడుతోంది భానుమతి. అప్పటికి కొంతసామాను లోపలపెట్టి యెదురొచ్చిన జగన్నాథం "ఆఁ, ఆఁ జాగర్త; కుడికాలు ముందు పెట్టాలి" అని హాస్యంవాడేడు.

ఆ మాట విన్న భానుమతికి అప్పుడెప్పుడో జరిగిన సరసమైన సంభాషణా, మధురమైన సంఘటనా క్షణంపాటు మనసులో మెదిలి కులాసావేసింది. ఆ కులాసాలో కొద్దిగా అడుగు తడబడి "చాల్లెండీ..... జోకులూ మీరూనూ" అని శాన్నాళ్ళ తరువాత నిండుగా నవ్వి అక్షరాలా కుడికాలే పెట్టింది లోపల.

చెప్పులు విడిచిపెట్టి, చేతివాణ్ణి చంకలోంచి దింపింది భానుమతి.

"జోకేం లేదు. పాత యింటిని కొత్త యిల్లుగా మార్చేం. కొత్త కాపరానికి కుడికాలు లోపలెట్టి గృహప్రవేశం చెయ్యాలికదా!" అని ప్రగల్భంగా నవ్వేడు జగన్నాథం.

జాఫ్రీ వరండాలోంచి గదిలోకి అడుగుపెడుతూ బిత్తరపోయింది భానుమతి.

పాతయిల్లే.

కానీ ఇది తన పాత యిల్లుకాదు.

సరికొత్త వాసనలు తగిలాయి కళ్ళకి. ఉన్న సామానంతా ఆడదిక్కులేని సంసారంలా చెయ్యకుండా ఎంతో ఒద్దికగా సర్దేసుంది.

ఆ మూల టేబిలు మీద సరికొత్త రేడియో.

ఈగోడ సెంటర్లో స్విచ్చిబోర్డు కింద ఒక స్టూలు; దానిమీద సరికొత్త టేబిలు ఫ్యాను.

మంచానికీ కిటికీకీ మధ్య సరికొత్త సైకిలు

"ఏమిటలా చూస్తున్నావు?" అంటూ గర్వంగా మీదికొచ్చాడు జగన్నాథం.

"రేడియో, సైకిలూ, ఫానూ" అని తడారిన గొంతుకతో జపంచేసింది భానుమతి.

"కొన్నారా!?" అని ఎక్కడున్న మనిషి అక్కడే చతికిలపడిపోయింది.

"అదేమీ?" అంటూ జగన్నాథం పక్కనే కూచుని కళ్ళలో కళ్ళు పెట్టుకుచూసేడు.

భానుమతికి అంత హఠాత్తుగా అంత బాధెందుకు కలిగిందో అతనికి అర్థం కాలేదు.

❖ ❖ ❖

మన బతుకులు త్రిశంకు స్వర్గాలు, మధ్యతరగతి వాళ్ళం.... మనం పైవాళ్ళని దగాచేస్తే పళ్ళు రాలగొట్టి పంపిస్తారు. కిందివాళ్ళని దగా చేస్తే తిట్టీ ఏడ్చీ రచ్చకీడ్చి అల్లరిచేస్తారు. అంచేత మనం ఎవర్నీ దగా చెయ్యలేం. ఇంకెవర్ని దగా చేసినా వొప్పుకోరు. అంచేత మన్ని మనమే దగా చేసుకోవాలి కాబోలు - అనుకున్నాది భానుమతి; నెత్తి కొట్టుకుంటూ.

"భానూ, భానూ! ఏమిటది? ఎందుకలా అయిపోతున్నావు?" అని జెబ్బపట్టుకు వూపాడు జగన్నాథం. "నేనేం అప్పులు చేసి కొన్లేదే బాబూ యివన్నీను! లీవు ట్రావెల్ కన్సెషన్లో నా టిక్కెట్లు రెండూ నిజంగా వెళ్ళకుండా రాయించేననా. మరి ఆమాత్రం జాగర్త లేకపోతే యెలాగే! థరుడు క్లాస్‌లో ప్రయాణంచేసి ఫస్టుక్లాసులో వెళ్ళినట్టు రాసుకునే మా ఆఫీసర్లకంటె ఘోరమా?

"ఈ రెణ్ణెల్ల పాటూ సామానంతా వంటింట్లో సర్దేసి ముందుగది ఎవరో హాస్పిటల్ పనీమీదొచ్చిన వాళ్ళకి అద్దెకిచ్చేను. మనం వాటా అంతటికీ డెబ్బయ్యిస్తున్నామా, వాళ్ళు ఆ ఒక్కగదికీ నెలకెనభై చొప్పున రెండునెలలూ యిచ్చారు. సెలవుమీదున్న పదిహేను రోజులూ సింహాచలంలో మా ఫ్రెండు దగ్గిర గడిపేశాను. మరి ఈ నెలా పదిహేనురోజులూ ఈ క్యాంపుడ్యూటీ వేయించుకున్నానా! - అన్ని సదుపాయాలూ వాళ్ళే చూసేరు.

"ఏదో అలా అలా మిగుల్చుకొనే కొన్నాను గాని నేనేం అప్పులు చేసీ లంచాలు పట్టీ కొన్లేదే బాబూ! అదేనా, నీ బాధ?"

అని భానుమతి పక్కనే గొంతికిల్లా కూచుని సముదాయించసాగేడు జగన్నాథం.

తల నిలువుగా ఆడించింది భానుమతి. "రేడియో - ఫానూ - సైకిలూ కొన్నారు...!" అంది నిర్జీవంగా నవ్వుతూ.

"అవునూ; కొన్నానూ!" అన్నాడు జగన్నాథం.

"మీరు కొన్నారు. మా అన్నయ్య అవన్నీ అమ్మేసేడు!"

*("జయశ్రీ" మాసపత్రిక ; సంక్రాంతి 76)*